క్లుప్తంగా

పత్తి విత్తనాలు వేయొద్దు

అయిజ: ఎండలు, వడగాల్పులు అధికంగా ఉన్నందున పత్తి విత్తనాలు ప్రస్తుతం వేయొద్దని ఏఓ శంకర్‌లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నైరుతి రుతు పవనాల ప్రవేశం ఆలస్యం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం 38 నుండి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉన్నాయని, దుక్కిలో విత్తనాలు వేస్తే మొలకలు రావని వివరించారు. అధికారుల సూచనలు సలహాలు పాటించాలని కోరారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

మానవపాడు: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని సద్గురు గుడికల్లు గాజా హుస్సేన్ పీరా స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని అమరవాయి, చెన్నిపాడు గ్రామాలలో గంధం మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. భక్తిమార్గం ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని వివరించారు.

నేడు సంపద వనం ప్రారంభం

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మితమైన లిఫ్టు–2 మార్లబీడు పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సంపద వనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వల్లూరుక్రాంతి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా

శాంతినగర్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దేవేందర్ మాతృమూర్తి సవారమ్మ శనివారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులతో కలిసి పాడె మోశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా అండాగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ఆర్థికసాయం పెంచాలి

గద్వాలరూరల్: కులవృత్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం సరిపోదని మరింత పెంచాలని ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మదుసూదన్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కనీసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. బీసీ జాబితాలో చేర్చబడ్డ ప్రతి కులానికి కూడా ఆర్థికసాయం వర్తింపజేయాలని కోరారు.

'మన్ కీ బాత్' వీక్షించిన నాయకులు



అయిజ: ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్వహిస్తున్న 102వ మన్ కీబాత్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆదివారం వీక్షించారు. అయిజ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌స్వామి గృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన తిలకించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేడికొండ భీంసేన్‌రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, శివన్న, గడిగ రఘు, వెంకటేష్ యాదవ్, వీరేష్‌గౌడ్, పింజరి ఈరన్నలు పాల్గొన్నారు.

బీవీఎఫ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శాంతినగర్: బహుజన వలంటరీ ఫోర్స్ (బీవీఎఫ్) శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కోకన్వీనర్ బాబునాయక్ అన్నారు. ఆదివారం వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ భవాని ఫంక్షన్‌హాల్‌లో అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్ ఆధ్వర్యంలో బీవీఎఫ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. 100 మంది యువకులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ మరో నాలుగు రోజులపాటు కొనసాగుతుందని ఆసక్తి కలిగిన యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ రీసోర్స్‌పర్సన్ స్వాములు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని రంగసముద్రం నీటి ఆయకట్టు కింద ఉన్నటువంటి తూములను తెరవడంతో కాల్వల ద్వారా నీరు వృథాగా కిందికి వెళ్తూ పంటపొలాలు తడుస్తున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రంగసముద్రం తూములను మూసి నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా నీళ్ల పండుగ



గట్టులో అధికారులు, గ్రామస్తులతో సర్పంచ్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకుల దగ్గర ఆదివారం మంచినీళ్ల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు నీళ్ల ట్యాంకుల దగ్గర ప్రజలకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి అందిస్తున్న స్వచ్ఛ జలాల గురించి వివరించారు.

ఉండవెల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచి నీళ్ల పండుగ నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ నుంచి అనుసూయమ్మ కాలనీలోని మిషన్ భగీరథ ట్యాంక్ వరకు సర్పంచ్ రేఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నీటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ హర్షద్, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఉప సర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, ఎంపీటీసీ సుంకన్న, పంచయతీ కార్యదర్శి అశోక్, గ్రామ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంచి నీళ్ల పండుగ దినోత్సవాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భగా వాటర్‌మెన్ తిక్కయ్యను సర్పంచ్ బీసన్నగౌడ్ పూలమాల శాలువాతో సత్కరించారు.



ఉండవెల్లిలో..



వాటర్‌మెన్ తిక్కయ్యను సన్మానిస్తున్న సర్పంచ్

ధరూరు: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని చింతరేవులలో నీళ్ల పండుగ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా చేపట్టని విధంగా రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీరందిస్తున్నామన్నారు. ఎంపీపీలు నజీమున్నీసా బేగం, మనోరమ, జెడ్పీటీసీలు పద్మావెంకటేశ్వంరరెడ్డి, రాజశేఖర్, వైస్ ఎంపీపీలు సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణనాయుడు, సర్పంచు శిల్ప తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగు నీరు అందించిన ఘటన బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని సర్పంచ్ ధనలక్ష్మి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు తాగు నీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎండాకాలంలో కూడా నిరంతరం తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు, మిషన్ భగీరథ ఏఈ కృష్ణయ్య, కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, ఉప సర్పంచ్ సుజాత, గ్రామస్తులు నాగరాజు, దేవన్న, బుడ్డన్న, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎల్‌సీ సంఘం నాయకుడు

గద్వాల అర్బన్: ప్రజా పోరాటాలు చేస్తున్న వారిపై అక్రమ కేసులు ఎత్తేయాలని పౌర ప్రజా స్వామిక హక్కుల సంఘం, పాలమూరు అధ్యయన వేదిక, రైతాంగ సమితి నాయకులు సుభాన్, గోపాల్ యాదవ్, ఇక్బాల్ పాషాలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనలు తెలిపితే సంఘాల నాయకులపై 152మందిపై కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. అక్రమ కేసులను బేషరత్తుగా ఎత్తేయాలన్నారు. ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ రవికుమార్, సీఎంఎస్ రేవతి తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు



అలంపూర్: జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటన ఆదివారం అలంపూర్ చౌరస్తాలోని వెంకటసాయి విలాస్ కాలనీ ఎదురుగా ఉన్న 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం వనపర్తి జిల్లా జట్‌ప్రోల్‌కు చెందిన రాములు పని నిమిత్తం తన ట్రాక్టర్‌పై కర్నూల్‌కు వెళ్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనూజ్ కారులో హైదరాబాదు నుంచి బెంగుళూరు బయలుదేరాడు. చౌరస్తాలోని జాతీయరహదారి ఫ్లెఓవర్ సమీపంలో ట్రాక్టర్‌ను కారు ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొన్నది. కొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనాలు దెబ్బతిన్నాయి. ఎవరికి ఏ ప్రమాదం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కోదండాపురంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్, పోలీస్ కళా బృందం సభ్యులు ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, షీ టీమ్స్, డయల్ 100, పోలీస్ చట్టాలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పోకడల గురించి పాటలు, మాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరికైనా అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉన్నా వెంటనే డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కడైనా విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్ నంబర్లను 8712670312, 799313139 సమాచారం అందించాలన్నారు. మైనర్ బాలికలను లైంగికంగా వేధిస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో షీ టీమ్, కళా బృందం సభ్యులు రాధమ్మ, రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు, దివ్యవాణి, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మీ సేవలో చోరీ

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో తేజ కమ్యూనికేషన్ మీ సేవలో శనివారం రాత్రి చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం ఎప్పటిలాగే శనివారం పనులు ముగించుకొని మీ సేవ నిర్వాహకుడు దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. అదేరోజు రాత్రి మీ సేవ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి మానిటర్, సీపీఓ, ప్రింటర్ ఎత్తుకెళ్లారని తెలిపారు.

బీజేపీ కార్యకర్తపై సర్పంచ్ దాడి

ధరూర్: బీజేపీ కార్యకర్త రాములుపై ఓ సర్పంచ్ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని యములోనిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త రాములు మరో వ్యక్తితో కలిసి ఈ నెల 11న మండలంలోని చింతరేవుల గ్రామ సమీపంలోని మద్యం తాగేందుకు వచ్చాడు. అదేసమయంలో పక్కనే సర్పంచ్ రామకృష్ణ మద్యం తాగుతున్నాడు. మరో 20 ఏళ్లపాటు సర్పంచ్ నేనే అని రామకృష్ణ అనడంతో బీజేపీ కార్యకర్త జోక్యం చేసుకొని మరోసారి గెలిచే అవకాశం లేదని అనడంతో సర్పంచ్ కోపోద్రిక్తుడై బీజేపీ కార్యకర్తపై దాడి చేశాడు. మద్యం సీసాతో తలపై బాదడంతో రక్తస్రావం అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని శాంతింపజేసేందుకు యత్నిస్తుండగా సర్పంచ్ పోలీస్ సమక్షంలో దాడికి దిగాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

మహిళల ఆరోగ్యంపై సర్వే



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళ ఆరోగ్యంపై సర్వే ఆదివారం నిర్వహించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి మహిళల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులక పంపిస్తామని మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



కేటీదొడ్డిలో బంగారు అందజేస్తున్న మైలగడ్డ శేఖర్



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. స్వామి వారికి దాసాంగాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి కిరీటం కోసం మైలగడ్డ శేఖర్ రెండు తులాల బంగారం, గద్వాలకు చెందిన వెంకట్ రెడ్డి, వరలక్ష్మి ఆలయానికి రెండు తులాల బంగారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో..

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవిఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టుతిమ్మప్పస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గద్వాల పట్టణంలోని కాకతీయ టెక్నోస్కూల్ యాజమాన్యం ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడులో అమావాస్య సందర్భంగా ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎద్దుల అమావాస్య సందర్భంగా రైతులు ఎద్దులను అలంకరించి పంట పొలాల్లో పూజలు చేశారు. అనంతరం లింగన్‌వాయి గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల, నారాయణపురం, అమరవాయి, మానవపాడు, పెద్దపోతులపాడు, బోరవెల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అమావాస్య పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేకంగా అలంకరించారు.

గట్టు: మండల కేంద్రంలోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా మట్టితో ఎద్దులను తయారు చేసి పూజించారు. స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. గట్టుకు చెందిన జీ. నగేష్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. మాచర్లలోని చెన్నకేశవస్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

జెడ్పీచైర్ పర్సన్ దంపతుల పూజలు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అదే విధంగా కోతులగిద్ద అరణేశ్వర స్వామి, అల్వాలపాడు గ్రామంలోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

మల్దకల్: సీడ్ పత్తి పంట సాగు చేసి ఎర్రతెగులు సోకి నష్టపోయిన రైతులకు సీడ్ కంపెనీల నిర్వాహకులు నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీవీ నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బిజ్వారంలో ఎర్రతెగులు సోకిన సీడ్‌పత్తి పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిగడ్డలో దాదాపు 40 వేల ఎకరాలలో రైతులు సీడ్ పత్తి సాగు చేశారన్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారని పేర్కొన్నారు. సీడ్ పత్తి పంటకు ఎర్రతెగులు సోకి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహా, శివన్న, ఆంజనేయులు, మోషు, వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అయిజ మున్సిపాలిటీ మున్నూరు కాపు సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్రహం, డాక్టర్ అజయ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం అయిజ మున్సిపాలిటీలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆసంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సురేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీధర్, మున్నూరు కాపు సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరుకు చెందిన ఆశన్న ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం ఆదివారం వల్లూరు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

తమిళనాడు స్వామి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



భక్తులకు దర్శనం ఇస్తున్న స్వామిజీ

కేటీదొడ్డి: తమళనాడు నుంచి వచ్చిన స్వామిజీ సంతోష్‌కుమార్‌ను దర్శించుకునేందుకు మండల కేంద్రంతో పాటు కేటీదొడ్డి, ధరూర్, గద్వాల, కర్ణాటక భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య కావడంతో మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. మూడు రోజుల నుంచి కొండాపురం స్టేజీ సమీపం వద్ద ఉన్న వ్యవసాయ పొలంలో తమిళనాడు స్వామిజీ భక్తులకు దర్శనం ఇస్తున్నారని తెలియడంతో ఆయా ఆలయాల నుంచి భక్తులు అక్కడికి తరలి వెళ్లారు. అక్కడ ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు స్వామిజీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి



సమావేశానికి హాజరైన యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో వడ్డేపల్లి యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం యూటీఎఫ్ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, ఉపాధ్యాయులకు బదిలీలతో కూడుకున్న ప్రమోషన్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ బకాయిలను తక్షణమే ప్రకటించాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు తిలక్, కుమార్‌నాయుడు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్



బహుమతులు అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్

ఎర్రవల్లిచౌరస్తా: క్రీడలతో బంగారు భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్ అన్నారు. ఇటిక్యాల మండలంలోని షేకుపల్లిలో ఎంపీపీ స్నేహశ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై గెలుపొందిన జట్లకు, ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం జెడ్పీ మాజీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడలను నిర్వహించడం వల్ల యువత ఆహ్లాదంగా ఉండటంతో పాటు స్నేహపూర్వక వాతావరణ ఏర్పడుతుందన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. యువత క్రీడల్లో ప్రతిభను కనబర్చి ఉన్నత శిఖరాలకు చేరుకొని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హనుమంత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాగబలిమి, రవీందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే



గట్టులోని గొర్లఖాన్‌దొడ్డిలో..

మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో ఓటరు జాబితా సవరణలను యాప్ ద్వారా బీఎల్ఓలు నమోదు చేస్తున్న వివరాలను ఆర్డీఓ రాములు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 23వ తేదీ వరక అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: ఓటరు జాబితాలో సవరణలపై రెవెన్యూ అధికారులు మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి సర్వే నిర్వహించారు. రెండు చోట్ల ఓటరు నమోదు ఉన్న పేర్లతో మరణించిన వారి పేర్లు జాబితాలో తొలగించడం, కొత్త పేర్లను చేర్చడం వంటి అంశాలను వివరించారు. గరుడ యాప్ ద్వారా సవరణలు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన సర్వేలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ సికిందర్, ఆర్ఐ శ్రీనువాసులు పాల్గొన్నారు.



రాజోళిలో..



కలుకుంట్లలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ రాములు

గట్టు: ఓటర్ల జాబితా సవరణలు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ జుబేర్ అహ్మద్ బీఎల్ఓలకు సూచించారు. ఆదివారం గొర్లఖాన్‌దొడ్డి, మాచర్ల, బల్గెర గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌తో కలిసి ఆయన ఇంటింటా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

23వ తేదీ వరకు ఓటరు నమోదు

అయిజ: ఈనెల 23వ తేదీలోగా 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సాయిప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఫామ్ 6 లో వివరాలు నమోదు చేసి బూత్ అధికారులకు అందజేయాలని తెలిపారు.